క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం వాయిదా



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈ సమావేశానికి ఎంపీపీ,వైస్‌ఎంపీపీలు హాజరుకాకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు పల్లాల కొండారెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి సమావేశం నిర్వహించారు. అయితే కోరానికి సరిపడా ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు. కాగా వరుసగా రెండోసారి మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ మోహన్‌రెడ్డి ఒప్పందం ప్రకారం రెండున్నర ఏళ్లకు రాజీనామా చేయాలి. కానీ ఆయన టీడీపీలో చేరి రాజీనామా చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

కలప చెట్ల వేలం

ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెంలోని పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయంలోని కలప చెట్లను బుధవారం వేలం వేశారు. ఉదయగిరిలోని జలవనరుల శాఖ కార్యాలయంలో డీఈఈ చంద్రమౌళి ఆధ్వర్యంలో జలాశయం లోతట్టు ప్రాంతంలో కొట్టాలపల్లి, జెట్టివారిపల్లి, గడ్డంవారిపల్లె సమీపంలో ఉన్న కంపకర్ర చెట్ల నరికివేతకు వేలం నిర్వహించగా కావేటి వెంకటేశ్వర్లు రూ.90,600కు కలపను దక్కించుకున్నారు. ఏఈలు వేణు, సురేష్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని పాఠశాలల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) సంఘ నేతలు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. యానియన్ నేతలు పేరం మల్లికార్జున, టీ శ్రీనివాసులు, బీ శ్రీహరి, పీ కొండారెడ్డి మాలకొండయ్య, మోహన్‌రెడ్డి,ధర్మపురి ప్రసాద్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సంగంలో వర్షం



సంగం: మండల కేంద్రమైన సంగంలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరుగా వర్షం పడింది. ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఉండి సాయంత్రం వేళ ఒక్కసారిగా ఈదురుగాలులతో వర్షం కురిసింది. కొద్దిరోజులుగా వడగాలులు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ తరుణంలో వర్షం పడడంతో కాస్తా సేదతీరారు.

పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



ఆత్మకూరు: పట్టణానికి చెందిన 21 మంది పేద విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ దంపతులు సైకిళ్లను వితరణ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్‌తో కలిసి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. మెప్మా కార్యాలయంలో మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆర్డీఓ బీ పావని, పీడీ లీలారాణి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, మెప్మా సీఎంఎం హర్షి త, సీఓ మాధవి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

ఉదయగిరి: డెంగీ సోకకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు సూచించారు. ఉదయగిరిలోని పీసీ అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ రాత్రి వేళల్లో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పకుండా వేయించాలి

కావలి (జలదంకి): చిన్నారులకు టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని వైకుంఠపురం అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి మేఘనా చౌదరి అన్నారు. కావలి పట్టణంలోని వైకుంఠపురం అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో మద్దూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు టీకాలను వేయించడంపై తల్లిదండ్రులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఐరన్, కాల్షియం సిరప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, సీహెచ్‌ఓ చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు వెళ్లేదెలా?



దగదర్తి మండలం కొత్తపల్లి కౌరగుంట గ్రామ సచివాలయంలోని మరుగుదొడ్లు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. గ్రామ సచివాలయంలో బయట, లోపల మరుగుదొడ్లు ఉన్నాయి. ఉద్యోగులు లోపల మరుగుదొడ్లను వినియోగిస్తూ బయట నిర్మించిన వాటిని పట్టించుకోవడం లేదు. దీంతో బయట మరుగుదొడ్ల చుట్టూ పిచ్చిచెట్లు దట్టంగా మొలిచి అపరిశుభ్రంగా మారాయి. దీంతో సచివాలయానికి వచ్చే అర్జీదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ స్వచ్ఛాంధ్ర పేరుతో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలంటూ ఊదరగొట్టే అధికారులు తమ కార్యాలయాలను చక్కదిద్దుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్ల చుట్టూ ఉన్న పిచ్చిచెట్లను తొలగించి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– దగదర్తి

పీఆర్ ప్రాజెక్ట్ భవనానికి మోక్షమెన్నడో?



ఆత్మకూరు పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన ప్రాజెక్ట్ విభాగం భవనానికి మోక్షం కలగడం లేదు. ఆత్మకూరులో పీఆర్ ప్రాజెక్ట్ భవనానికి ప్రత్యేక భవనం లేకపోవడంతో దశాబ్దాలుగా ఇక్కడ విధులు నిర్వహించాల్సిన అధికారులు, సిబ్బంది జిల్లా కేంద్రమైన నెల్లూరులోనే ఉంటూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. దీంతో విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పంచాయతీరాజ్‌శాఖకు చెందిన భవనాన్ని భవిత కేంద్రం కోసం వినియోగిస్తుండగా ఖాళీ చేయించి ఆధునీకరణ పనులు ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా పనులు ముందుకు సాగకపోవడంపై సంబంధిత వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు భవనం రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై పీఆర్ ప్రాజెక్ట్ విభాగం డీఈ సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా నిధుల సమస్యల వల్ల తాత్కాలికంగా పనులు నిలిపివేశామని, కొద్ది రోజుల్లోనే పూర్తి స్థాయిలో నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

– ఆత్మకూరురూరల్

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి (జలదంకి) : ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తోందని, ఇటువంటి కష్టకాలంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు తాను అన్ని విధాలా అండగా ఉంటానని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దగదర్తి మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దగదర్తి మండలంలోని రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎవరైనా ఇబ్బందులు పెడుతుంటే తన దృష్టికి తీసుకురావలని సూచించారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనంతరం కావలిలోని నాల్గో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి యారం బ్రహ్మారెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో పాతూరిలోని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను రామిరెడ్డి పరామర్శించారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి చొరవచూపాలి

అల్లూరు: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రజనీకాంత్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ గుమ్మడి సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

ఎల్లమ్మకు విశేష పూజలు



విశేషాలంకారంలో ఎల్లమ్మ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న భక్తులు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలోని ఎల్లమ్మ ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారిని స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పులివర్తి వంశీయులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల మూసివేత

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలపై చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా ప్రైవేట్ పాఠశాలలను గురువారం మూసివేస్తున్నట్లు అపస్మా కార్యవర్గ సభ్యులు తెలిపారు. పట్టణంలోని మేధా పాఠశాలలో అపస్మా కార్యవర్గ సభ్యులు బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలపై బెదిరింపు ధోరణిలో కొందరు అధికారులు ప్రవర్తించడం, ధ్రువీకరణలేని ఫిర్యాదుల ఆధారంగా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టడం, కొన్ని పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం, పాఠశాలల గుర్తింపులు రద్దు చేస్తామని యాజమాన్యాలను బెదిరించడం, తదితర చర్యలతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను అగౌరవపరచడంతో పాటు మానసికంగా హింసకు గురిచేస్తున్నారని అపస్మా కార్యవర్గ సభ్యులు ధ్వజమెత్తారు. అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ రమణారెడ్డి, కార్యదర్శి జీ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఎస్‌కే రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరెడ్డి, టీసీ వెంకటసుబ్బయ్య, జి సురేష్‌బాబు, ఎం చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తమ డిమాండ్‌ల పత్రాలను చూపుతున్న అపస్మా కార్యవర్గ సభ్యులు

కోలాహలంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎడ్లు

కలిగిరి: కలిగిరి గ్రామదేవత కలిగిరమ్మ తిరునాళ్లలో భాగంగా బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు కోలాహలంగా సాగాయి. ఈ పోటీల్లో మొత్తం 13 జతల ఎడ్లు పాల్గొనగా నిర్వాహకులు 9 జతలకు బహుమతులను ప్రదానం చేశారు. అల్లూరు మండలం గోగులపల్లికి చెందిన పల్లిబోయిన కృష్ణతేజారెడ్డి ఎడ్లు ప్రథమ, నెల్లూరు రూరల్ పొట్టేపాళేనికి చెందిన లెనిన్ ఎంటర్‌ప్రైజెస్ ఎడ్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులను అందుకున్నాయి. ఆ తరువాత స్థానాల్లో కలిగిరి మండలం వీర్నకొల్లుకు చెందిన రొడ్డా మస్తాన్, ఆత్మకూరు మండలం గొల్లపల్లికి చెందిన ఎం శ్రీనివాసులురెడ్డి, కొండాపురం మండలం ఆదిమూర్తిపురానికి చెందిన దారా వెంగళరావు, పొదలకూరు మండలం తాడిపర్తికి చెందిన కంటా సుధీర్‌రెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడకు చెందిన ఎం ప్రమీల, నెల్లూరు రూరల్ పొట్టేపాళేనికి చెందిన వెంకటరమణయ్య ఎడ్లు నిలిచి బహుమతులను అందుకున్నాయి. కలిగిరి సీఐ పీ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కలిగిరి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చి ఉత్సాహంగా పోటీలను తిలకించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సంగంలో మంజులకు సత్కారం



దుత్తలూరు: ఏరుకొల్లు జెడ్పీహెచ్‌ఎస్‌లో..

సంగం: స్థానిక ఆర్‌ఎస్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన మేరీమంజులను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

దుత్తలూరు: మండలంలోని ఏరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం మాధవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్ రామారావు, పీ శ్రీనివాసులు, జీ లక్ష్మి, సీహెచ్ లావణ్యను సహచర ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

విలేజ్ హెల్త్‌క్లినిక్‌లో చోరీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఐదో సచివాలయం పరిధిలోని విలేజ్ హెల్త్‌క్లినిక్ సెంటర్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హెల్త్‌క్లినిక్ సెంటర్ తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు కంప్యూటర్, టేబుల్, కుర్చీలను అపహరించారు. గతంలో కూడా దుండగులు సచివాలయం తలుపులు, కిటికీలు పగలగొట్టి ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పెద్దగా పట్టించుకోకపోవడంతో మరోమారు విలువైన వస్తువులను చోరీ చేశారు. బుధవారం ఉదయం విధులకు వచ్చిన ఎంఎల్‌హెచ్ పీ విజయలక్ష్మి చోరీని గుర్తించి పోలీసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్సై జయరాజు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాత్రి వేళల్లో హెల్త్‌క్లినిక్ వద్ద మందుబాబులు మద్యం సేవిస్తూ ఖాళీ సీసాలను పరిసరాల్లో పడేస్తున్నారని ఎంఎల్‌హెచ్ వాపోయింది. తాను ఉదయం 9 గంటలకు విధులకు వచ్చే సమయానికి కొందరు ఆకతాయిలు హెల్త్ క్లినిక్ ముందుభాగంలో మత్తులో ఉంటున్నారని,ఇక్కడ డ్యూటీ చేయాలంటే ఎంతో భయంగా ఉందని విన్నవించారు. పూర్తిస్థాయిలో రక్షణ కల్పించకపోతే విధులు నిర్వహించడం ఇబ్బందిగా ఉంటుందని ఆమె కన్నీటిపర్యంతమైంది.



ఏఎస్సైకు వివరాలు వెల్లడిస్తున్న విజయలక్ష్మి

డిప్యూటీ ఎంపీడీఓ బదిలీ

సీతారామపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పూర్తి అదనపు బాధ్యతలతో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ భార్గవిరెడ్డి బాపట్లలోని ఈటీసీ శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. గత నాలుగున్నరేళ్లుగా మండల ఈఓపీఆర్డీగా పని చేసిన భార్గవిరెడ్డి ఇటీవల ఎంపీడీఓ (ఎఫ్‌ఏసీ)గా నియమితులయ్యారు. ఈమె స్థానంలో ఉదయగిరి ఎంపీడీఓ అప్పాజీకి పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించినట్లు అధికారిక సమాచారం. భార్గవిరెడ్డి త్వరలో రిలీవ్ కానున్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

ఉదయగిరి: పట్టణంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం పర్యటించనున్నారని టీడీపీ మండల కన్వీనర్ సీహెచ్ బయన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దిలావర్‌బాయివీధిలో సాయంత్రం జరిగే సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

కొండాపురం: కొమ్మి పంచాయతీ రామానుజపురంలోని పోలేరమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5న బీఎల్వోలకు శిక్షణ

వింజమూరు(ఉదయగిరి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీఎల్వోలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హమీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎల్వోలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఉపాధి కూలీల హాజరును పెంచాలి

కొండాపురం: ఉపాధి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీఓ ఆదినారాయణ ఉపాధి సిబ్బందికి సూచించారు.మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కల్పించాలని అడిగిన ప్రతిఒక్కరికీ పనులు చూపాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఏపీఓ మురళి, సిబ్బంది ఉన్నారు.

పెన్నానది పొరంబోకు ఆక్రమణపై కేసు నమోదు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం మడపల్లికి చెందిన లింగంగుంట్ల వసంతపై బుధవారం కేసు నమోదు చేసినట్లు చేజర్ల ఎస్సై తిరుమలేశ్వరరావు తెలిపారు. వసంతను పలుమార్లు హెచ్చరించినా లెక్కచేయకుండా పెన్నానది పొరంబోకును ఆక్రమించి సాగుచేస్తున్నట్లుగా తహసీల్దార్ బీ మురళి, ఇరిగేషన్ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అన్నదానం

కావలి (జలదంకి): కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌లో ఉన్న సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలోని పేద చిన్నారులకు మున్సిపల్ మాజీ చైర్మన్ నగ్గల శ్రీనివాస్‌కిరణ్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం విందు భోజనం అందించారు. కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, సంయుక్త సేవా సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యులు ప్రసాద్‌రావు, ఖాదర్‌బాషా, హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు ఘనీబాషా పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

కావలి (జలదంకి) : విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ అన్నారు. కావలి మండల గౌరవరంలో ఉన్న ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామిరెడ్డి తొలుత విద్యార్థులతో కలిసి మార్చ్‌వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. మంచినడవడికతో పాటు పోటీ తత్వం, విజ్ఞాన సంపదను పెంపొందించి విద్యార్థుల పురోభివృద్ధికి బాటలు వేయాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ నమూనాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతి తరగతిలో విద్యార్థి నాయకులను ఎన్నుకుని వారికి బాధ్యతలు, నాయకత్వ లక్షణాలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ చంద్రజ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి మార్చ్‌వాక్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

జాయింట్ ఎల్‌పీఎంలను వెంటనే పరిష్కరించాలి

దుత్తలూరు: గ్రామాల్లో భూములకు సంబంధించి జాయింట్ ఎల్‌పీఎంలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ యనమల నాగరాజు తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలకు సంబంధించిన అర్జీలు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు

సీతారామపురం : రైతులు భూసార పరీక్షలను నిర్వహించుకుని అందుకనుగుణంగా పంటలను సాగు చేసి ఎరువులను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ చెన్నారెడ్డి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన సింగారెడ్డిపల్లిలో పర్యటించారు. మొక్కజొన్న పంటను పరిశీలించి కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు లీటరు నీటికి 0.5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్‌ను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఏఈఓలు సుధీర్ కుమార్, సాంబశివయ్య, వీపీఏ స్వప్న, రైతులు పాల్గొన్నారు.

అల్లూరు: మండలంలోని బీరంగుంటలో ఏఓ వెంకటేశ్వర్లు రైతులకు వరి పంటలో సస్యరక్షణపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు.

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం నాగలవెలటూరు, నెర్నూరు గ్రామాల్లో ఏఓ పీ హిమబిందు పర్యటించారు. రైతుసేవా కేంద్రాల్లో ముందుగా నమోదు చేసుకున్న రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. కౌలురైతులకు సీసీఆర్ కార్డులపై అవగాహన కల్పించారు.



సీతారామపురం: మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏఓ

విజయవాడకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

వింజమూరు(ఉదయగిరి): ఆత్మకూరు డిపో నుంచి వింజమూరు, చాకలకొండ, తూర్పుయర్రబల్లి, కొండాపురం, లింగసముద్రం, వలేటివారిపాళెం, కందుకూరు మీదుగా విజయవాడకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. ఈ మేరకు నెల్లూరులో నెల్లూరు రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉదయం 6.30 గంటలకు ఆత్మకూరు నుంచి సర్వీసును నడిపితే ఐదు మండలాల పరిధిలోని 30 గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని విన్నవించారు.ఈ ప్రాంతాలకు చెందిన అనేక కుటుంబాలు ఉపాధి కోసం విజయవాడ, గుంటూరు సమీప ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉన్నందున రాకపోకలకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. స్పందించిన సురేష్‌రెడ్డి వెంటనే ఆత్మకూరు డిపో మేనేజర్, ఆర్‌ఎంతో మాట్లాడి త్వరలో బస్సు సర్వీసును నడిపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

కావలి (జలదంకి): కావలిలోని ట్రంకురోడ్డులో వంగవీటి రంగా కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, రంగా విగ్రహావిష్కరణ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వంగవీటి రంగా కుమారుడు రాధాకృష్ణ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంత్రులు మాట్లాడుతూ పేదబడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా అని కొనియాడారు. తొలుత మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు పుల్లారెడ్డినగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మకాలనీలో రూ.1.60 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. వెంగళరావునగర్‌లో ఉర్దూఘర్, షాదీఖానాను ప్రారంభించారు. రైతు బజారులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

